# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక -251 మార్చి 1-3-2025 పేజీలు -8 వెల.రూ 3



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపుణ్యం.. సాంస్కృతిక అవగాహన.. మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది జర్నలిస్టు డైరీ దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు - 8790413465




## 6న తెలంగాణ కేబినేట్ భేటీ

- పలు కీలక అంశాలపై చర్చ

హైదరాబాద్,
రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మార్చి 6వ తేదీన నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగనుంది. ఈ కేబినెట్ సమావేశంలో పలు కీలక -మిగతా 3 లో

## పనిచేసిన వారికి
# పదవులు ఇస్తాం

### రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి రక్ష

- పనిచచేయని వారి పదవులు ఊడబెరుకుతాం
- కష్టపడ్డవారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుంది
- పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం రేవంత్



హైదరాబాద్,
పదవులు రాలేదని కాంగ్రెస్ నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా పదవులు వస్తాయన్నారు. రాహుల్ గాంధీని ప్రదాని చేయడమే లక్ష్యంగా అంతా




కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీ భవన్ లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో కాంగ్రెస్ కొత్త ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ తో పాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. -మిగతా 3 లో



## 2న నగరంలో ఉపరాష్ట్రపతి
# పర్యటన

### భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ సమీక్ష


హైదరాబాద్
మార్చి 2వ తేదీన రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ పర్యటిచనున్నారు. ఈ సందర్భంగా తగిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సమిక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ తగిన ఏర్పాట్లు చేయాలని -మిగతా 3 లో



## మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్

- దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం
- ఫిక్కీ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడీ

హైదరాబాద్,
రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమిస్తాం.



## వరంగల్ ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- విమానాశ్రయ విస్తరణకు కేంద్రం ఆమోదం
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ,
వరంగల్ నగర ప్రజలకు కేంద్రం శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎయిర్‌పోర్ట్ కలనినెరవేర్చింది. వరంగల్ జిల్లాలోని మామూనూర్‌లో విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. -మిగతా 3 లో

# వామ్మో ఓయో..!

- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ఎల్బీనగర్ సిరీస్ రోడ్ లోని ఓయో
- అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారంటూ స్థానికంగా ఆరోపణలు
- నోరు మెదపకుండా చోద్యం చూస్తున్న మున్సిపల్ యంత్రాంగం
- చర్యలు తీసుకోవాలంటూ ప్రజల నుంచి డిమాండ్ల వెల్లువ

ఎల్బీనగర్, ఫిబ్రవరి 28 (జర్నలిస్టు డైరీ)
ఎల్బీనగర్ మున్సిపాలిటీ పరిధిలో ఓయో లాడ్జి ఆగడాలు రోజురోజుకి మితిమీరి పోతున్నాయి. స్థానికంగా అనుమతులు ఎలా ఇస్తున్నారో తెలియదు కానీ ఇష్టం వచ్చినట్టుగా అనుమతులు తెచ్చుకుని జనావాసాల మధ్య ఏర్పాటు చేస్తున్నారు. అడుకోవాల్సిన అధికారులు తమకేం పట్టిందిలే అన్న చందంగా -మిగతా 3 లో










## సంక్షేమానికే పెద్దపీట

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పోరేషన్ల ద్వారా స్వయం ఉపాధి
- సబ్సిడీలు, మార్జిన్ మనీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం
- బ్యాంకర్ల ద్వారా స్వయంఉపాధి పథకాలకు రూ. ఆరు వేల కోట్లు
- ఈ నెల 2న వనపర్తిలో ప్రారంభించనున్న సీఎం
- బ్యాంకర్ల త్రైమాసిక సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఆ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ కార్పొరేషన్లన్నింటినీ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సబ్సిడీలు, మార్జిన్ మనీ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. స్వయం ఉపాధి పథకాలకు బ్యాంకర్లతో కలిసి సుమారు రూ. ఆరువేల కోట్ల విలువైన ఉపాధి పథకాలను వచ్చేనెల 2న సీఎం రేవంత్ రెడ్డి వనపర్తిలో ప్రారంభిస్తారనీ, -మిగతా 3 లో

# దేశ రక్షణలో హైదరాబాద్ కీలకం

-దేశ ప్రగతి, రక్షణకు నూతన ఆవిష్కరణలు అవసరం
-గచ్చిబౌలిలో నేషనల్ సైన్స్‌డే ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్
-ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్**

దేశాన్ని రక్షించడంలో హైదరాబాద్ అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిషన్‌ను కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. డీఆర్‌డీవో, డిఫెన్స్, ఏరోస్పేస్ ఉత్పత్తులకు చెందిన 200 స్టాల్స్ ప్రదర్శించారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో భారత సామర్థ్యాలను ప్రదర్శించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నేషనల్ సైన్స్ డే ఎగ్జిబిషన్ జరగనుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపై ఉందని చెప్పారు. బీడీఎల్, డీఆర్డీఓ, మిదానీ, హెచ్ఏఎల్ వంటి దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తయారు చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి హైదరాబాద్ నగరం, హైదరాబాద్ చుట్టూ పరిశ్రమలు ఉన్నాయన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు దేశభక్తి , దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తిని, అవగాహన కల్పించడానికి ఈ ప్రత్యేకమైన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతి ఏటా లక్షకుపైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ చదివి, అమెరికాకు వెళ్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వారిలో దేశభక్తితో, దేశ రక్షణ ప్రాధాన్యతనలు వివరించడానికి ఈ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని అన్నారు. తెలంగాణ నుంచి కేవలం ఐటీ ప్రొఫెషనల్స్ మాత్రమే అమెరికాకు వెళ్లకుండా, దేశ రక్షణ రంగానికి అవసరమైన సమర్థవంతమైన ఇంజినీర్లు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశ రక్షణ కోసం అవసరమైన ఇంజినీర్లను తయారుచేయడం మరింత ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా హైదరాబాద్‌లో బీడీఎల్, హెచ్‌ఎచ్‌ఎల్, మిదాని, డీఆర్‌డీఓ వంటి అనేక సంస్థలు దేశ రక్షణ కోసం ఉత్పత్తి రంగంలో విశేషంగా పని చేస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ రంగానికి హైదరాబాద్, బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గతంలో మీతో చర్చించినట్లుగా హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రీయల్ కారిడార్‌గా ప్రకటించాలని.. తద్వారా భారీగా పెట్టుబడులు వస్తాయని అన్నారు. రాకెట్ తయారీ సహా ఆకాశ మార్గం (స్కై రూట్) వంటి స్టార్టప్‌లు అభివృద్ధి చెందుతాయని.. అందుకోసం కేంద్ర ప్రభుత్వ సహకారం, మద్దతు అవసరమని తెలిపారు. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లేందుకు తాము ప్రయత్నిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## భాజాపా పాలనలో అణచివేత విధానాలు


పిసిసి విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ్




**హైదరాబాద్**

సమాజంలో అన్ని వర్గాలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. భాజపా పాలనలో దేశంలో అన్ని విధాలుగా అణచివేత కొనసాగుతోందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ఇప్పుడు జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం అవసరమని వివరించారు. రాష్ట్రంలో కులగణన, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. కుటుంబ సర్వేలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం కూడా సామాజిక న్యాయం గురించి మాట్లాడుతోందని ఎద్దేవా చేశారు. ఏడాది కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని.. ప్రచారం చేయడంలో కొంత వెనుకబడిపోయామని తెలిపారు. దేశం మొత్తంలో తెలంగాణలోనే ఈ ఏడాది ఎక్కువ ధాన్యం పండించినట్లు పేర్కొన్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని.. ఇవన్నీ జనంలోకి తీసుకెళ్లి ప్రచారం చేసుకోవాలని వివరించారు. పీసీసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్ లో పేలిన మానవ బాంబు..



**హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి అతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్ కు భారీ షాక్ తగిలింది. శుక్రవారం సాయంత్రం ప్రార్థనల్లో బాంబు దాడి జరిగింది. పాక్ లో పెషావర్లోని దారుల్ ఉలుం హఖానియా మాదర్సాలో ఈ దాడి జరిగినట్టు తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రం మాదర్సాలో ప్రార్థనలు జరుగుతుండగా.. ఓ సూసైడ్ బాంబర్ వారివైపు దూసుకు వచ్చినట్టు సమాచారం. ప్రార్థనలు చేస్తున్నట్టు నటించి తనను పేల్చేసుకోగా ఆ భవనం పూర్తిగా ధ్వంసం అయింది. ఈ దాడిలో ఐదుగురు అక్కడికక్కడే మరణించగా.. 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ దాడి అనంతరం పెషావర్లో ఎమర్జెన్సీ విధించారు. అయితే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నీ జరుగుతున్న వేళ.. పాక్ లో ఈ బాంబు దాడి జరగడం కలకలం రేపుతోంది. టోర్నీ భద్రతపై పలు దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. టోర్నీని తక్షణమే పాక్ నుంచి తరలించాలని ఐసీసీకి డిమాండ్లు మొదలయ్యాయి.

## 20 మంది ఉద్యోగుల్ని తొలగించిన మెటా సంస్థ..



**శాన్ ఫ్రాన్సిస్కో:**

సంస్థ సమాచారాన్ని లీక్ చేసిన 20 మంది ఉద్యోగుల్ని మెటా ( Meta కంపెనీ తొలగించింది. ఆ ఉద్యోగులు రహస్య సమాచారాన్ని లీక్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాళ్లు ఏ ఉద్దేశంతో సమాచారం లీక్ చేసినా.. తమ విధానాలకు విరుద్ధమని మెటా సంస్థ ప్రతినిధి పేర్కొన్నారు. ఇటీవల కంపెనీలో ఓ దర్యాప్తు చేపట్టామని, దాంట్లో 20 మంది ఉద్యోగులు దోషులుగా తేలారని, వాళ్లు కంపెనీ రహస్య సమాచారాన్ని బయటకు చేరవేస్తున్నట్లు తెలిసిందని ఆ ప్రతినిధి చెప్పారు. త్వరలో మరికొంత మంది కూడా ఉద్యోగాలు కోల్పోయే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు.సంస్థ సమాచారాన్ని లీక్ చేసే అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటామని, లీక్‌లు జరుగుతున్నట్లు గుర్తించినప్పుడల్లా ఇలాంటి చర్యలు ఉంటాయని అన్నారు. ఇటీవల ఉద్యోగులతో జుకర్‌బర్గ్ నిర్వహించిన వరుస మీటింగ్‌ల తర్వాత ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ప్రస్తుతం అమెరికాలోని ట్రంప్ సర్కారుకు అనుకూలంగా మెటా కంపెనీ తన ప్రణాళికల్ని రచిస్తున్నది.

## ఈయూ కమిషన్ చీఫ్‌తో మోడీ భేటీ

-ఎఫ్‌టీఏపై చర్చలు

**న్యూఢిల్లీ**

యూరోపియన్ యూని యన్ (ఈయూ) కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో ప్రధాని మోడీ సమావేశా మయ్యారు. ఈ సమా వేశంలో పెండిం గ్‌లో ఉన్న ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) ను ఈ ఏడాది చివరి నాటికి ముగించే దిశగా చర్చలు జరి పామని మోడీ తెలిపారు. అలాగే నూతన వ్యూహాత్మక భద్రత, రక్షణ భాగ స్వామ్య ఒప్పందంపై కూడా చర్చించినట్లు చెప్పారు. భారత్-ఈయూల మధ్య సంబంధం సహజమైనది, సేంద్రీయ మైనదని మోడీ ఈ సందర్భంగా అభి వర్ణించారు. ప్రజాస్వామ్య విలువులు, ఉమ్మడి నమ్మకంపై ఈ బంధం ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఉర్సులా వాన్ డెర్ లేయన్ మాట్లాడుతూ ఆర్థిక సమస్యలు, సాంకేతిక సహకారం, భద్రత, రక్షణ వంటి ఆంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకున్న భౌగోళిక, రాజకీయ సందర్భం నేపథ్యంలో భారత్‌తో నిర్ణయాత్మక చర్యను కోరుకుంటున్నట్టు చెప్పారు.

## ప్రభుత్వ కార్యక్రమాలకు దేవాలయ నిధులా

-హిమాచల్ సర్కార్ తీరుపై మండిపడ్డ బిజెపి



**న్యూఢిల్లీ,**

నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీజేపీ ఆరోపణలు గుప్పిస్తోంది. రాష్ట్ర సంక్షేమ పథకాల కోసం ఆలయ ట్రస్టుల నుంచి నిధులు కోరుతోందని ఆరోపించింది. అయితే, దీనిపై ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు మాట్లాడుతూ, ఈ విరాళం స్వచ్ఛందంగా అందించబడిందని, ఇది సుఖ్ ఆశ్రయ్ పథకం కింద అనాథలకు భవన నిర్మాణ సౌకర్యాల కోసం అని చెప్పారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న తర్వాత, కాంగ్రెస్ ప్రభుత్వంపై తాజా విమర్శలు వచ్చాయి. బీజేపీ నేత, ప్రతిపక్ష నాయకుడు జైరామ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆలయ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తూ, నిధులను పంపాలని కోరుతోందని ఆరోపించారు. 'ఒక వైపు కాంగ్రెస్ ప్రభుత్వం సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తోంది, హిందూ వ్యతిరేక కామెంట్స్ చేస్తోంది. మరోవైపు దేవాలయాల నుంచి డబ్బు తీసుకుని ప్రభుత్వ పథకాలకు నడపాలని అనుకుంటోంది. దేవాలయాలు, ట్రస్టులతో సంబంధం ఉన్న వ్యక్తులతో పాటు ప్రజలు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాలి' అని మాజీ సీఎం ఠాకూర్ అన్నారు. గత నెలలో, రాష్ట్ర సాంస్కృతిక శాఖ రాసిన లేఖలో, ముఖ్యమంత్రి సుఖ్ ఆశ్రయ్ యోజన మరియు ముఖ్యమంత్రి సుఖ్ శిక్షా యోజనకు ఆలయ ట్రస్టులు నిధులు సమకూర్చడానికి మార్గదర్శకాలను వెల్లడించింది. గతేడాది ఆగస్టులో సుఖు ప్రభుత్వం, ఆయన మంత్రి వర్గం జీతభత్యాలను చెల్లించడాన్ని 2 నెలలు వాయిదా వేస్తామని చెప్పింది. దీంతో రాష్ట్రంలోని ఆర్థిక సంక్షోభం స్పష్టంగా కనిపించింది. ఆగస్టు 2023 నుంచి ఆ రాష్ట్రాన్ని కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. 2024 ఆగస్టులో కులు, సిమ్లాలో 'క్లౌడ్ బరస్ట్' జరిగింది. ఆకస్మిక వరదలతో 30 మందికి పైగా మరణించారు. ఇతర జిల్లాలతో కలిపి మొత్తం 100 మందికి పైగా మరణించారు. మొత్తం నష్టం రూ. 842 కోట్లు. 2023లో రూ. 10,000 కోట్ల నష్టం వాటిల్లింది.

## ట్రంప్‌కు ఎదురుదెబ్బ.. ఉద్యోగుల తొలగింపు నిర్ణయాన్ని నిలిపివేసిన డిస్ట్రిక్ట్ జడ్జ్



**అమెరికా**

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టి పాలనలో దూకుడు ప్రదర్శిస్తున్న డొనాల్డ్ ట్రంప్ కు ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు విషయంలో ట్రంప్ నిర్ణయానికి డిస్ట్రిక్ట్ జడ్జి విలియం అల్సప్ బ్రేకులు వేశారు. భారీ సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని నిలిపివేశారు.కాగా, అమెరికా ప్రభుత్వ వ్యయాల తగ్గింపు ప్రణాళికల్లో భాగంగా పలు విభాగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగులను ట్రంప్ సర్కార్ తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో అమెరికాలో ఫెడరల్ ఏజెన్సీల్లో ఉద్యోగులను తొలగించాలన్న ప్రభుత్వ చట్టవిరుద్ధమైన ఆదేశాలపై పలు యూనియన్లు, న్యాయవాద సంఘాలు దావా వేశాయి. దీనిపై తాజాగా యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ జడ్జి విలియం అల్సప్ తీర్పును వెలువరించారు. అధ్యక్షుడి నిర్ణయాన్ని నిలిపివేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. పర్సనల్ మేనేజ్‌మెంట్ కార్యాలయానికి అలాంటి అధికారాలు లేవని న్యాయమూర్తి స్పష్టం చేశారు. తొలగింపు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆదేశించారు. ఈ తీర్పుతో ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది.

## ఈశా ఫౌండేషన్‌కు సుప్రీంలో ఊరట

కాలుష్య నియంత్రణ బోర్డు ఆదేశాలు పాటిస్తుందని వెల్లడి



**న్యూఢిల్లీ,**

ఈశా ఫౌండేషన్‌కు సుప్రీంలో ఊరట దక్కింది. కోయంబత్తూరు వెల్లియన్‌గిరి కొండలో నిర్మించిన ఈశా ఫౌండేషన యోగా, ధ్యాన కేంద్రంపై నిర్బంధ చర్య ఏదీ ఉండరాదని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సూర్య కాంత్; ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఆదేశించింది. కాలుష్య నియంత్రణ బోర్డు జారీ చేసిన పర్యావరణ నిబంధనలు, ఆదేశాలు అన్నిటినీ యోగ, ధ్యాన కేంద్రం పాటిస్తుందని బెంచ్ తెలియజేసింది.వెల్లియన్‌గిరి కొండ దిగువన సరైన పర్యావరణ అనుమతి లేకుండా భవనాల నిర్మాణంపై జగ్గీ వాసుదేవ్ సారథ్యంలోని ఈశా ఫౌండేషన్‌కు తమిళనాడు కాలుష్య నివారణ బోర్డు (టిఎన్‌పిసిబి) జారీ చేసింది. ఈ నోటీసులను రద్దు చేసిన మద్రాసు హైకోర్టు ఉత్తర్వులపై జోక్యానికి సుప్రీం కోర్టు శుక్రవారం నిరాకరించింది. యోగ, ధ్యాన కేంద్రాన్ని విస్తరించే పక్షంలో సముచిత ప్రాధికార సంస్థ ముందస్తు అనుమతి తీసుకోనున్నట్లు బెంచ్ తెలిపింది. అయితే, ఈ ఉత్తర్వు అక్రమ నిర్మాణం క్రమబద్ధీకరణకు ఆనవాయితీని సృష్టించబోదని, కేసు విలక్షణ వాస్తవాలు, పరిస్థితుల దృష్ట్యా ఈ ఉత్తర్వు జారీ చేయడమైందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కోయంబత్తూరులో ఈశా ఫౌండేషన్ ఏర్పాటు చేసినవి విద్య కేటగరీ కిందకు వస్తాయని పేర్కొంటూ హైకోర్టు 2022 డిసెంబర్ 14న టిఎన్‌పిసిబి నోటీసును కొట్టివేసింది. 2021 నవంబర్ 19న బోర్డు జారీ చేసిన నోటీసును హైకోర్టు కొట్టివేసి, ఈశా ఫౌండేషన్ పిటిషన్‌ను అనుమతించింది. ముందస్తు పర్యావరణ అనుమతి లేకుండా వెల్లియన్‌గిరి కొండ దిగువన భవనాల నిర్మాణంపై బోర్డు సంజాయిషీ నోటీస్ జారీ చేసింది.

# పనిచేసిన వారికి పదవులు ఇస్తాం

(మొదటి తరువాయి)

నాలుగైదేళ్లు జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చాం. పార్టీలో నమ్మకంగా ఉన్నవారికి ఉన్నత పదవులు ఇచ్చాం. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నాం. మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫీడ్‌బ్యాక్ తీసుకొని పదవులు ఇస్తాం. ప్రస్తుతం రెండేళ్ల కాలానికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. మార్చి 10 లోపు జిల్లాల వారీగా ఇన్‌ఛార్జి మంత్రులు నామినేటెడ్ పదవులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే వరకూ మనం విశ్రమించొద్దన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవద్దు. రాహుల్ ప్రధాని అయితే, దేశం అభివృద్ధి అవుతుంది. కాంగ్రెస్‌కు తక్కువ.. ఎక్కువ.. అనే తారతమ్యాల్లేవు. అనుభవజ్ఞులైన ఇద్దరిని ఇప్పటికే రాజ్యసభకు నామినేట్ చేశాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. రాష్ట్రంలో కులగణన అనేది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే అత్యధిక పన్నులు కడుతున్న రాష్ట్రం తెలంగాణ. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు ఇవ్వాల్సిన బాధ్యత పార్టీపైనే ఉంటుందని అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది అని తెలిపారు. పని చేసిన వారి జాబితాను కొత్త ఇంఛార్జ్ సిద్ధం చేస్తారు.. కొందరికి పదవులు రాలేదు.. మొదటి విడతలో కార్పొరేషన్ ఛైర్మన్లు రెండేళ్లు అవకాశం ఇచ్చాం.. పని తీరు సరిగ్గా లేని వారిని కొనసాగించామని పేర్కొన్నారు. ఇప్పుడు ఏం అనను.. రెన్యువల్ కోసం వస్తారు కదా అప్పుడు చెప్తానని తెలిపారు. పదవి వచ్చింది కదా అని కూర్చున్న వాళ్లకు కొనసాగింపు ఉండదని సీఎం రేవంత్ తేల్చి చెప్పారు. ఇక, మార్చి 10వ తేదీ లోపు ఇంఛార్జ్ మంత్రులు జిల్లాకు వెళ్ళండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదాయ కమిటీలు, మార్కెట్ కమిటి డైరెక్టర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి.. వాటికి సంబంధించిన జాబితా సిద్ధం చేయండి.. అందరికీ పదవులు ఇచ్చేద్దాం.. అలాగే, పదవులు వచ్చిన వాళ్ళు.. పదవి వచ్చింది నేను ఎందుకు పని చేయడం అనుకుంటున్నారు.. పదవి రాని వారు, పదవి రాలేదు కదా నేననేందుకు పని చేయడం అని అనుకుంటున్నారు.. మంచిని మైక్ లో చెప్పండి.. ఇక, పార్టీ నాయకులకు నా విజ్ఞప్తి.. ఏదైనా సమస్య అంటే చెవిలో చెప్పండి అన్నారు. గుజరాత్ మోడల్ సక్సెస్ మోడల్ కాదు.. ఆయన ప్రమోట్ చేసుకున్నారు.. టాక్స్ కలెక్షన్ లో తెలంగాణ నే టాప్.. ఆరో ప్లేస్ లో గుజరాత్ ఉంది.. విదేశీ పెట్టుబడులు తెచ్చింది తెలంగాణ.. వరి ధాన్యం పండించిన మొదటి రాష్ట్రం తెలంగాణ.. కాళేశ్వరం లేకుండానే కోటి 56 లక్షల టన్నులు పండించామని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. అలాగే, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేసే వరకు కసి తగ్గొద్దు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మేము కష్ట పడుతున్నాం.. మీరంతా కష్ట పడాలన్నారు. అనుకూల వాతావరణం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడండి అని చెప్పుకొచ్చారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు అందరు అక్కడికి వెళ్లారు.. రెస్క్యూ ఆపరేషన్ ను మంత్రులు దగ్గరుండి మరి పరిశీలించారు అని చెప్పారు. ఇక, కాస్మటిక్ చార్జీలు కేసీఆర్ పెంచలేదు.. మనం పెంచాము అని రేవంత్ రెడ్డి తెలిపారు.

# వరంగల్ ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్


(మొదటి తరువాయి)

ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి ఇవ్వడంపై సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండ సురేఖ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శంషాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో మరో ఎయిర్‌పోర్టు ఉండరాదని జిఎంఆర్ సంస్థ గతంలో ఒప్పందం చేసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం, రామ్మోహన నాయుడు జరిగిన చర్చల తర్వాత జిఎంఆర్ సంస్థ కూడా ఎలాంటి అభ్యంతరం లేదని తెలపింది. దీంతో విమానాశ్రయ పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ పరిధిలో 696 ఎకరాల స్థలం ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమి కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్టుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ మేరకు భూసేకర జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 205 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# వామ్మో ఓయో..!

(మొదటి తరువాయి)

వ్యవహరిస్తుండడంతో ఓయో లాడ్జిలో ఇష్టం వచ్చినట్లుగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుస్తున్నారు. ఎవరు పడితే వారు ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి ఓయో లాడ్జిని వినియోగించుకుంటున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఓయూ లాడ్జిలో కాలక్షేపం చేసి వెళ్తున్నారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఎల్బీనగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎల్బీనగర్ సిరీస్ రోడ్డు శ్రీ శంకర్ కాలనీలో సెయింట్ ఆల్ ఫోన్స్ గ్రామర్ స్కూల్ పక్కన ఓయో లాడ్జి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ లాడ్జిపై చర్యలు తీసుకోవాలని గత పది రోజుల క్రితం స్థానికులు పోలీసులకు ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతోపాటు మున్సిపల్ సిబ్బంది ఈ లాడ్జిల వ్యవహారాన్ని చక్కబెడతారని పోలీసులు తెల్పడంతో మున్సిపల్ సిబ్బందికి సైతం ఫిర్యాదులు చేశారు. మున్సిపల్ సిబ్బంది తమకేం పట్టిందిలే.. చూసుకుందాంలే అన్న విధంగా వ్యవహరిస్తుండడంతో స్థానికంగా సమస్య మరింత జటిలంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. కాలనీలో ఇండ్ల మధ్యలో లాడ్జిని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా లాడ్జిని తొలగించి నివాసయోగ్యానికి అనుకూలంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే సమస్య మరింత తీవ్రం అవుతుందని హెచ్చరిస్తున్నారు.




### మాది కాదంటే మాది కాదు...!

మున్సిపాలిటీ పరిధిలో ఈ ఓయో లాడ్జి గురించి ఎన్ని ఫిర్యాదులు చేసిన ఓ పక్క పోలీస్ యంత్రాంగం, మున్సిపల్ విభాగాలు పట్టించుకోవడం లేదని ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఆ బాధ్యత తమది కాదు అంటే తమది కాదు అంటూ ఒకరిపై ఒకరు నెట్టేస్తూ సమస్యను మరింత పెంచుతున్నారని ప్రజలు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే లాడ్జి నిర్వాహకులు మరింత రెచ్చిపోయి వారి వ్యాపారాన్ని విస్తృత పర్చుకొని స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేసే ప్రమాదం ఉందని ప్రజల నుంచి ఆందోళనలో వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ విభాగం చొరవ తీసుకొని సాధ్యమైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

### అనుమతులు ఎలా ఇస్తారు...

ఎల్బీనగర్ పరిధిలోని సిరీస్ రోడ్డు లో గల ఈ లాడ్జికి అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రజలు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సరైన అనుమతులు లేకుండానే ఈ లాడ్జిని వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసలు ఈ లాడ్జిని నిర్వహించుకునేందుకు అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రజలు మండిపడుతున్నారు. అయితే మున్సిపల్ యంత్రాంగం తమ చేతుల్లో ఏమి ఉండదని చెబుతున్నప్పటికీ వారి నుంచి అనుమతులు వస్తాయనే సమాచారం అందుతుంది. అసాంఘిక కార్యక్రమాలను స్థానికంగా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే అధికారులు మాత్రం మా బాధ్యత కాదంటే మా బాధ్యత కాదు అన్న చందంగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

# 6న తెలంగాణ కేబినేట్ భేటీ

(మొదటి తరువాయి)

అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో రెండో దఫా కులగణన నిర్వహించిన నేపథ్యంలో వాటికి సంబంధించిన గణాంకాలపై కేబినెట్ చర్చించనుంది. అలాగే బిసిలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు మార్చిలో ప్రత్యేకంగా అసెంబ్లీని సమావేశపరుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ అంశాలపై కూడా మంత్రి మండలి చర్చించే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. అలాగే రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ కారణంగా పలు జిల్లాల్లో ఈ విషయంలో తర్జనభర్జన జరుగుతోంది. మార్చి 3వ తేదీతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియనుంది. దీంతో కొత్త రేషన్ కార్డుల పంపిణీపై కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉందని సమాచారం. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు పలు అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనున్నట్లుగా తెలిసింది.

# 2న నగరంలో ఉపరాష్ట్రపతి పర్యటన

(మొదటి తరువాయి)

అధికారులకు ఆమె సూచించారు. కాగా ఉపరాష్ట్రపతి హైదరాబాద్ లోని ఐఐటిని సందర్శించి అక్కడి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటిస్తారని సిఎస్ తెలియజేశారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కూడా పాల్గొని అదే రోజు తిరిగి న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సి.ఎస్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వైద్యారోగ్య శాఖకు అర్హులైన వైద్యులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖకు చెప్పారు. ఈ సమావేశంలో హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్ హరీష్, హైదరాబాద్, సంగారెడ్డి కలెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి.

# మహిళల కోసం మినీ ఇండస్ట్రియల్ పార్క్

(మొదటి తరువాయి)

ప్రత్యేక బృందం ఇచ్చే నివేదిక ఆధారంగా దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఫిక్కిలో నిర్వహించిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇండస్ట్రియల్ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుంది. చేవెళ్ల డిక్లరేషన్‌లో దళితులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే. ఓవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే.. మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాం. పారిశ్రామికవేత్తలకు రాయితీగా అందాల్సిన బకాయిలు రూ. 4500 కోట్లకు పైనే ఉన్నాయి. వీటిలో రూ. 2,200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రావాల్సి ఉంది. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాం. వచ్చే నెలలో రూ. 300 కోట్లు చెల్లిస్తాం. ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి అందించే ఎంఎస్‌ఎంఈ ప్రత్యేక పాలసీ తీసుకొచ్చాం. స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను అందిస్తాం. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. రుణాలు పొందటంలో ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. తమిళనాడు, కర్ణాటకలో పారిశ్రామిక విధానాలపై అధ్యయనం చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు.

# సొరంగ ప్రమాదంలో 8 మంది సజీవసమాధి

(మొదటి తరువాయి)



కూరుకుపోయినట్లు అధునాతన పరికరాలు సూచించాయి. వీరు బతికి ఉంటారన్న ఆశతో చేపట్టిన పనులకు అవరోధాలు కలిగినా ముందుకు సాగారు. గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ మెషీన్ ద్వారా మట్టిలో కూరుకుపోయిన 5 మృతదేహాలు గుర్తించారు. ఈ 5 మృతదేహాలను వెలికి తీయడానికి మరింత సమయం పడుతుందని, కొన్ని మీటర్ల లోతు మట్టిలో మృతదేహాలు కూరుకు పోయినట్లు తెలుస్తోంది. మిగతా ముగ్గురి మృతదేహాల కోసం గాలిస్తున్నారు . ప్రమాద స్థలంలో రక్షణ చర్యలను వేగవంతం చేసేందుకు నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రంగంలోకి దిగింది. భూమిలో కూరుకుపోయిన వారి స్థితిని తెలుసుకునేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తోంది. జీరో గ్రావిటీ పెనట్రేటింగ్ రాడార్ టెక్నాలజీని ఉపయోగించి, భూమిలోకి తొలగిపోయిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందం శ్రమిస్తోంది. మిషన్ ఆధారంగా ఎన్జీఆర్ఐ బృందం టన్నెల్‌ను పూర్తిగా స్కాన్ చేసింది. దీని సాయంతో టన్నెల్‌లో ఐదు అనుమానాస్పద ప్రదేశాలను గుర్తించింది. ఈ ప్రాంతాల్లో శరీర నిఘా కోసం మార్కింగ్ నిర్వహించారు. రక్షణ బృందాలు ఆచూకీని కనుగొని, బాధితుల మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

## సంపాదకీయం

# జెన్‌కోను విస్మరిస్తున్నది ప్రయివేటు విద్యుత్తు కోసమేనా?

తెలంగాణ పునరుత్పాదక ఇందన విధానం-2025ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. పదేళ్ల పాటు ఈ విధానం అమల్లో ఉండనుంది. పర్యావరణ హితం కాని కర్బన్ ఉద్గారాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా, అదేవిధంగా రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌ను చేరుకోవడమే లక్ష్యంగా ఈ విధాన ప్రకటన ఉద్దేశ మని ప్రభుత్వం చెబుతున్నది. నిస్సందేహంగా సాంప్రదాయక శిలాజ (బొగ్గు, సహజవాయువు) ఇంధన వినియోగం కన్న సాంప్రదాయేతర పునరుత్పాదక (సోలార్, విండ్ తదితర) వనరుల వినియోగం పర్యావరణానికి ఎంతో మేలుచేస్తాయి. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాల్లో సోలార్ పవర్ ఉత్పత్తి 52శాతం ఉంది. సోలార్ సెల్స్ (ఫోటో వోల్టాయిక్ సెల్స్) జీవితకాలం 25 నుండి ముప్పై ఏండ్లు మాత్రమే. వీటి వ్యర్ధాలు సిలికాన్, కాడ్మియం, టెల్యూరియం భూగర్భజలాల్లోకి చేరి ఎన్నో రకాల సూక్ష్మజీవులు చని పోతాయని, ఫలితంగా పంటల దిగుబడి తగ్గిపోతుందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. మరొక సమస్య విద్యుత్ స్టోరేజీ సమస్య. సోలార్ పవర్ ఉత్పత్తి డే టైం లో మాత్రమే జరుగుతుంది. వ్యవసాయానికి డే టైంలో ఉచిత విద్యుత్ సోలార్ పవర్ ఉత్పత్తి పెరగడం వల్లనే సాధ్యమైంది. విద్యుత్ స్టోరేజ్ జరగాలంటే పెద్ద ఎత్తున లిథియం ఆయాన్ బ్యాటరీలు వినియోగించాలి. బ్యాటరీల్లో వాడే సిలికాన్, గ్రాఫైట్, కాపర్ తదితర పదార్థాల వ్యర్థాల వల్ల ఉత్పన్నమయ్యే పర్యావరణ సమస్యల గురించి విధాన ప్రకటనలో మాట మాత్రం లేదు. 2030 నాటికి మూడులక్షల టన్నులకు పైగా సోలార్ ప్యానల్ వ్యర్ధాలు పేరుకు పోతాయని ఒక అంచనా. విధాన ప్రకటనలో వేస్ట్ మేనేజ్మెంట్ చర్యలు ఏమిటో తెలుపలేదు. ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే ఉద్గారాలను తగ్గించే పేరుతో ప్రభుత్వ రంగ సంస్థ జెన్కోను పూర్తిగా విస్మరించి ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ విధాన ప్రకటన ఉన్నది. కేంద్ర ప్రభుత్వానికి కావలసింది కూడా ఇదే. ఇప్పటికే కేంద్రం విద్యుత్ సవరణ చట్టం-2022, నేషనల్ మోనిటైజేషన్ పైప్‌లైన్ పేరిట విద్యుత్ రంగం ప్రయివేటీకరణకు, కాంట్రాక్టీకరణకు పూను కుంటున్న ది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల నిర్మాణానికయ్యే భారీ ఖర్చుల వలన విద్యుత్ యూనిట్ రేటు భారీగా పెరగనున్నది. రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు భారీగా రాయితీలను ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. సౌర, పవన, పునరుత్పాదక ఇందనం, ఎనర్జీ స్టోరేజీ (బ్యాటరీంపంప్ స్టోరేజీ) ప్రాజెక్టులు, జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహించనుంది. ప్రస్తుతం రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్తు సరఫరా సామర్థ్యం 10,095.20 మెగావాట్లు ఉండగా, 2029-30 నాటికి 31,400 మెగావాట్లకు పెంచాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది. 2034-35 నాటికి 49,500 మెగావాట్లకు పెంచాలని భావిస్తోంది. విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం)లు టారిఫ్ ఆధారిత కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా కొత్త సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం, జియో థర్మల్, మినీ హైడల్, వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు బిడ్లను ఆహ్వానించనున్నాయి. వీటిని గ్రిడ్‌కు అనుసంధానం చేసి, విద్యుత్తును కొనుగోలు చేయనున్నాయి. డెవలపర్లకు ప్రభుత్వ స్థలాలను నామమాత్రపు అద్దెతో లీజుకిస్తాయి. డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రయివేటు సంస్థలకు అమ్ముకోవచ్చు. సొంత అవసరాలకూ వాడుకోవచ్చు. పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులను స్థాపించే భూములకు నాలా కన్వర్షన్ నుంచి మినహాయింపు. టీజీ-ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో సత్వర అనుమతులు. పారిశ్రామిక హోదా కల్పించి అన్ని రకాల ప్రోత్సాహకాలు. ప్రతి మెగావాటుకు నాలుగెకరాల చొప్పున భూగరిష్ఠ పరిమితి చట్టం నుంచి మినహాయింపు. భూముల కొనుగోళ్లపై స్టాంప్ డ్యూటీ వంద శాతం రిఫండ్. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సౌర, పవన విద్యుత్తు వాడుకుంటే ఎనిమిదేండ్ల పాటు విద్యుత్తు సుంకం నుంచి మినహాయింపు. డిస్కంలకు విద్యుత్తు విక్రయిస్తే ప్రోత్సాహకాలు. సౌర, పంప్, బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టులకు యాభై శాతం రాష్ట్ర జీఎస్టీ రిఫండ్ చేస్తారు. ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలపై ఏర్పాటు చేసే రూఫ్ టాప్ సోలార్ ప్రాజెక్టులకు వంద శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు. పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్రాజెక్టు (పీఎస్సీ)లకు ప్రభుత్వ భూములను 45 ఏళ్ల పాటు లీజుకిస్తారు. ఒకే ప్రాంతంలో సౌర, పవన, పవనం ఫ్లోటింగ్ సోలార్ వంటి హైబ్రిడ్ పునరుత్పాదక విద్యుత్తు ప్రాజెక్టులతో పాటు విండ్ స్టోరేజ్, హైబ్రిడ్ స్టోరేజీ వంటి ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహిస్తామని విధాన ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 1959లో ఏర్పడిన ఏపీఎస్ఈబి, చంద్రబాబు మొదటిసారి అధికారంలో చేపట్టిన తర్వాత 1998లో జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలుగా మూడు ముక్కలైంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత టీ(ఎస్)జి జెన్‌కోగా ఏర్పడింది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ జెన్‌కోను బలహీనపరుస్తూ వస్తున్నాయి. వాజ్‌పేయి నాయకత్వంలోని అప్పటి ఎన్డీయే (బీజేపీ) సర్కార్ తీసుకొచ్చిన విద్యుత్ చట్టం- 2003 ద్వారా ప్రయివేటు కంపెనీలకు, క్యాప్టివ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు విద్యుత్ ఉత్పత్తిలోకి ప్రవేశించడానికి అవకాశం ఏర్పడింది. బొగ్గు ఉత్పత్తిలో ఉన్న సింగరేణి సంస్థ విద్యుత్ ఉత్పాదన రంగంలోకి 2010లో ప్రవేశించింది. 1200 మె.వా.ల (2600 మె.వా.) ప్రాజెక్టు నిర్మాణాన్ని మంచిర్యాల జిల్లా, జైపూర్‌లో మొదలు పెట్టింది. 2016 సెప్టెంబర్‌లో ఉత్పత్తి ప్రారంభించింది. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికీ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం (రూ. 8250 కోట్లు) భారీగా పెరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం అధిక ధరలకు చేసుకున్నది. మార్వా ప్రాజెక్టు నుండి జరిగే విద్యుత్ ఉత్పత్తి ధర, ఇతర ఖర్చులు కలిపితే యూనిట్ ధర రూ.5కు మించుతుంది. అంతేకాకుండా భవిష్యత్తులో ధరలను సవరిస్తారు. సోలార్ విద్యుత్తును కేంద్ర ప్రభుత్వం విధించిన సీలింగ్ ధర యూనిట్ రూ.4.50లకు భిన్నంగా యూనిట్‌కు రూ.5.50 చెల్లించి తీసుకోవడానికి ఆయా ప్రయివేటు సోలార్ కంపెనీలతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. మరోవైపు విద్యుత్ చట్టం 2003, పరిశ్రమల వంటి పెద్ద వినియోగదారులు రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థల నుండే కాకుండా నేరుగా బహిరంగ మార్కెట్‌లో విద్యుత్తును కొనే అవకాశాన్ని కల్పించింది. పవర్ ఎక్స్ఛేంజిల్లో దొరికే చౌక విద్యుత్తును పరిశ్రమలు ఇటీవల పెద్దఎత్తున కొనడం మొదలు పెట్టాయి.

# ఎంతకాలమీ అప్పుల బాగోతం !



కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. ప్రతిదానికి కేంద్రం సాయాం చేయాలని దేబురిస్తున్నాయి. అదేపనిగా అప్పులు చేస్తూ ప్రజలపై భారం మోపుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో అప్పులు చేసి వడ్డీలు కడుతున్నాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో గత కెసిఆర్, జగన్ ఏలుబడిలో చేసిన లక్షల కోట్లు అభివృద్ధి పేరుతో దుబారా చేశారు. ఇప్పుడు వాటికి వడ్డీలకే వేలకోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇదంతా దుబారా కాక మరోటి కాదు. పథకాలపై సమీక్షించ కుండా ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీపడి ఉచిత పథకాలు అమలు చేస్తున్నాయి. పెన్షన్లు కూడా భారంగా మారాయి. కిలో రూపాయి బియ్యం పథకం కూడా భారంగా మారింది. వీటిపై సమీక్షించి, ధరలు పెంచాలన్న ఆలోచన చేయడం లేదు. ఇవన్నీ సమీక్షిస్తూ నెలకు కనీసం ఐదారువేల కోట్ల రూపాయలు మిగులుతాయి. తెలంగాణనే తీసుకుంటే వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తోందని సిఎం రేవంత్ రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు చూస్తే గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు ఎంతగా పెరిగాయో గమనించవచ్చు. అలాగే జగన్ చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం కూడా కోలుకోలేకుండా పోయింది. అప్పులు చెల్లించేం దుకు మరిన్ని అప్పులు చేసే బదులు ఖర్చులు తగ్గించుకోవచ్చు. దుబారాను అరికట్ట వచ్చు. కానీ ప్రభుత్వాలు అలా చేయడం లేదు. ప్రభుత్వ నిర్వహణ అంటే కేవలం అప్పులు చేసి, ప్రజలకు నగదు బదిలీ చేయడం అని జగన్ నిరూపించారు. రాష్ట్రాలన్ని ఇలా దివాళా దిశగా ఉన్నాయి. ఎక్కడా అభివృద్ధి కన్నా ఓట్లు రాబట్టే పథకాలే సాగుతున్నాయి. ఇందుకు ఏ రాష్ట్రం కూడా మినహాయింపు కాదు. అభివృద్ధి పక్కకు పోయింది. తెలంగాణలో కాళేశ్వరంపై తప్పులు ఒప్పుకోకుండా బిఆర్ఎస్ ఎదురుదాడికి దిగుతోంది. ఏ పథకం తీసుకున్నా అవినీతి కనిపిస్తోంది. నోరుంది కదాని బిఆర్ఎస్ నేతలు చేస్తున్న విపరీత వ్యాఖ్యలు,ఆరోపణలు జుగుప్స కలిగిస్తున్నాయి. ప్రతిపనికీ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించకపోవడం వల్ల ఇలా దివాళా తీయాల్సి వస్తోంది. అయితే మోడీని ప్రశ్నించే ముందు తమ రాష్ట్రాల్లో తాము ఎంత సచ్చీలంగా పాలన చేస్తున్నామో ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు గమనించాలి. ప్రజలు చేస్తున్నవిమర్శలకు సమాధానం చెప్పాలి. అలాగని కేంద్రం చేస్తున్న ఆర్థిక దుర్వినియోగాన్ని తప్పు పట్టకుండా ఉండలేం. కేంద్రం చేస్తున్న దుర్వినియోగాన్ని, దుర్మార్గాలను ఎండగట్టాల్సిందే. అవినీతి నేతలకు త్వరగా శిక్షలు పడాలి. అప్పుడే దేశంలో జవాబుదారీతనం వస్తుంది. ఎంతమంది అవినీతికి పాల్పడ్డారో వారందరినీ ఒకే గాటన కట్టివుంటే బాగుండేది. రాజకీయ అవినీతిని, కార్పోరేట్ మోసాలను అరికట్టే విషయంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ మోడీ మాత్రం విమర్శలను పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యాన్ని పట్టించుకోవడం లేదు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ఎంతకాలం ఇలా ముందుకు వెళతారన్నది చూడాలి. సిబిఐ, ఐటి, ఇడి దాడులపై వస్తున్న ఆరోపణలను పట్టించుకోవడం లేదు. ఆయా రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి అధికారాన్ని చేజిక్కించు కుంటున్న తీరు కాంగ్రెస్ పాలనకన్నా దారుణంగా ఉంది. వ్యవస్థలను భ్రష్టు పట్టించిన ఘనత కాంగ్రెస్ దయితే..అంతకుమించిన దారుణాలను ఇప్పుడు మోడీ అనుసరిస్తున్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టే ఇలాంటి చర్యలు సమర్థనీయం కాదు. ప్రజల సమస్యలను ప్రధానంగా పరిష్కరిస్తూనే...అవినీతి నేతలను బొక్కలో వేయాల్సిందే. రాజ్యాంగ సంస్థలు అందరి విషయంలో సమన్యాయంతో వ్యవహరించాల్సిన బాధ్యత వుంది. భారత ప్రజాస్వామ్యం పదికాలాలపాటు పటిష్టంగా నిలదొక్కుకోవాలంటే రాజ్యాంగ వ్యవస్థలు పటిష్టంగా పనిచేయాలి. నిష్పాక్షి కంగా నిర్ణయాలు తీసుకోవాలి. అధికారంలో ఉన్న సమయంలో అధికార పార్టీకి కొమ్ముకాసే విధంగా ఉండరాదు. ఇది ఒక్క కేంద్రం విషయంలో మాత్రమే జరగడం లేదు. రాష్ట్రాల్లో నూ ఇలాగే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు. కేంద్రాన్ని విమర్శిస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉంటే అవి రాజకీయ జోక్యంతో రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుంటు న్నాయి. అందుకే రాజ్యాంగ సంస్కరణలు రావాలని మేధావులు కోరుకుంటున్నారు. ప్రధానంగా వివిధ దర్యాప్తు సంస్థలు, ఎన్నికల సంఘం,ప్రణాళికా సంఘం అంటే నీతి ఆయోగ్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్జనరల్ వంటి అనేక సంస్థలు జవాబు దారీగా ఉండేలా పటిష్ట రాజ్యాంగం అవసరం. దేశ సమాఖ్య విధానంలో సహకార స్ఫూర్తిని పెంపొందించాల్సిన కేంద్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. భారత రాజ్యాంగ సంస్థల పట్ల విశ్వసనీయత పెరగాలి. అవి తీసుకునే నిర్ణయాలు ఏకపక్షంగా ఉండకుండా చూసుకోవాలి. అందుకు దేశవ్యాప్తంగా చర్చచేయాలి. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకుని స్వారీ చేసే పాలకుల తీరు మారాలి. ఇలాంటి పాలకులు వస్తారని బహుశా రాజ్యాంగ రచన చేసిన వారు ఊహించ ఉండరు. అందువల్ల వ్యవస్థలను బలోపేతం చేస్తూ..రాజకీయజోక్యం లేని పాలనా సంస్థలను రూపొందించుకోవాలి. కేంద్రంలో లేదా రాష్ట్రంలో అధికారాంలో ఉన్న పార్టీలు తమ అవసరాలకు వాటిని దుర్వినియోగం చేసే విధానాలకు చెక్ పెట్టాల్సిన అసవరం ఏర్పడింది. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే పాలకులు స్వారీ చేస్తారని ప్రజలు గుర్తించాలి. ఇలా ప్రజలు నిద్రలో ఉన్నంత కాలం పాలకుల తమ విధానాలనే రుద్దుతారు. తాము చేసిందే కరెక్ట్ అని చెబుతారు. దీనిని అడ్డుకోవడం అన్నది ప్రజలు తమ కర్తవ్యంగా గుర్తించాలి.

# మాట మార్చుతున్న ట్రంప్!




జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే డోనాల్డ్ ట్రంప్ మాటలు మారుతున్నాయి. అలాంటి వారు మడమ తిప్పటమే తరువాయి. సహజంగానే వ్యాపారి అయిన ఆ పెద్దమనిషి తనదైన శైలిలో అందరితో బేరసారాలాడుతున్నాడు. బిస్కెట్లు వేస్తున్నాడు. ఏది లాభసాటిగా ఉంటే దాన్నే అనుసరిస్తాడు. అధికారాన్ని చేపట్టిన నెల రోజుల తరువాత బుధవారం నాడు మొదటిసారిగా ట్రంప్ మంత్రివర్గ తొలి సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. ఖనిజాల మీద ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఉక్రెయిన్ భద్రత గురించి సాధారణం కంటే ఎక్కువగా ఎలాంటి హామీలు ఇవ్వటం లేదని ట్రంప్ చెప్పాడు. అంతే కాదు, శాంతి ఒప్పందం కుదరాలంటే పుతిన్ కొన్ని రాయితీలకు అంగీకరించాల్సి ఉంటుందని కూడా చెప్పాడు. ఒక వైపు స్థంభింపచేసిన నిధులపై ఆంక్షలను ఎత్తివేస్తూ ఆయుధాలు కొనుగోలు చేసేందుకు తైవాన్‌కు అవకాశం కల్పించిన ట్రంప్ దాని రక్షణ గురించి అడగ్గా తాను వ్యాఖ్యానానికి నిరాకరించటమే కాదు. చైనా పెట్టుబడులను అమెరికాకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పాడు. ఇది అమెరికా వైఖరికి భిన్నంగా ఉంది.

అందించిన మిలిటరీ, ఆర్థిక సాయాన్ని తీర్చే స్థితిలో ఉక్రెయిన్ లేనందున అక్కడ ఉన్న 500 బిలియన్ డాలర్ల విలువగల విలువైన ఖనిజాలు, సహజ సంపదలున్న ప్రాంతాలను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. తీరా ఇప్పుడు వాటిని వెలికి తీసేందుకు రెండు దేశాలు కలసి ఒక సంస్థను ఏర్పాటు చేసి తద్వారా వచ్చే రాబడిలో సగాన్ని దాని ద్వారా ఉక్రెయిన్ రక్షణ, పునర్ నిర్మాణానికి ఖర్చు చేయాలని అంగీకరించినట్లు చెబుతున్నారు. అమెరికా ఇచ్చిన సాయానికి అది ఖనిజాలను స్వాధీనం చేసుకుంటే తామిచ్చినదాని సంగతేమిటనే ప్రశ్న నాటోలోని ఐరోపా ధనిక దేశాల నుంచి రావటం అనివార్యం. అందువలన ఉమ్మడి సంస్థ పేరుతో అమెరికా పెత్తనంలోకి వెళ్లేట్లుగా చూస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఒకటి స్పష్టమైంది. గత మూడు సంవత్సరాలుగా ఉక్రెయిన్ ప్రతిఘటనలో రష్యాకు తగిలిన ఎదురుదెబ్బలు, ఓటమి అంటూ పశ్చిమ దేశాలు, వాటి కనుసన్నలలో నడిచే మీడియా వండివార్చిన కట్టుకథలు, కృత్రిమ వీడియోలు వాస్తవం కాదని, ఉక్రెయిన్ ఓడిపోవటం తప్ప మరొకటి జరగదని తేలిపోయింది. అంతేగాక, ప్రతిదాన్ని డాలర్ల లాభాలతో కొలిచే ట్రంప్‌కు ఉక్రెయిన్ మీద పెట్టే ప్రతి డాలరునూ రాబట్టుకోవటం కష్టమని, అందువల్లనే ఖనిజాల ఒప్పందం అని కూడా చెబుతున్నారు. విజయం సాధించినట్లు పుతిన్ చెప్పుకోవచ్చు గానీ అది ఉక్రెయిన్‌లో గెలిచో మరొకదానితోనో కాదని ట్రంప్ యంత్రాంగ చర్యలతో అనే కొత్త పల్లవిని పశ్చిమ దేశాల విశ్లేషకులు ఎత్తుకున్నారు. శుక్రవారం నాడు జెలెన్‌స్కీ వాషింగ్టన్ వెళతాడని, ఒప్పందం మీద సంతకాలు చేస్తాడని వచ్చిన వార్తలు కార్యరూపం దాలిస్తే ఒప్పంద అంశాలు వెల్లడైన తరువాత మాత్రమే ఒక స్పష్టత వస్తుంది.

ఒకవైపు చైనా మీద ఇక యుద్ధమే శరణ్యం అన్నట్లుగా సుంకాలు విధించేందుకు పూనుకున్నట్లు చెబుతున్న ట్రంప్ బుధవారం నాడు చైనాలో అంతర్భాగం-తిరుగుబాటు రాష్ట్రంగా ఉన్న తైవాన్ రక్షణ గురించి వ్యాఖ్యానించేందుకు నిరాకరించాడు. చైనా నేతతో తనకు మంచి సంబంధం ఉందని, చైనా పెట్టుబడులను కోరుతున్నట్లు చెప్పాడు. నిజానికి ఇది చైనాకు బిస్కెట్ వేయటం తప్ప మరొకటి కాదు. తైవాన్‌కు 87 కోట్ల డాలర్ల మిలిటరీ సాయంతో సహా 530 కోట్ల డాలర్లను ఇచ్చేందుకు గతంలో నిర్ణయించిన అమెరికా ఆ నిర్ణయాన్ని స్థంభింపచేసింది. తాజాగా నిధుల విడుదలకు నిర్ణయించింది. అలాంటపుడు బలవంతంగా తైవాన్ స్వాధీనానికి చైనాను అనుమతిస్తారా అన్న ప్రశ్నకు మాట్లాడేందుకు నిరాకరించినంత మాత్రాన వైఖరిని మార్చుకున్నట్లు కాదు. ఉక్రెయిన్ మీద ట్రంప్ మాటలను చూస్తుంటే తైవాన్‌ను కూడా వదిలించుకుంటారా అన్నది జనాభిప్రాయంగా ఉందని, ఇలా అయితే అమెరికా వాగ్దానాలను ఎవరూ నమ్మరని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వాపోయింది. ఖనిజాల ఒప్పందంతో ట్రంప్‌ను సంతుష్టీకరించేందుకు ఉక్రెయిన్ ఎలా చూస్తున్నదో తైవాన్ కూడా అమెరికా నుంచి ఏడు నుంచి పది బిలియన్ డాలర్ల విలువగల ఆయుధాలను కొనుగోలు చేస్తామని లీకులు వదిలింది. కొద్ది రోజులుగా ట్రంప్ చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రకటనలకు తేడా ఉంది. అందుకే అవి ఏ విధంగా మారతాయి, ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తాయన్నది ఊహించటం కష్టం.

## ఆంక్షలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

-కలప, ఇసుక అక్రమ రవాణాలకు పాల్పడితే వాహనాలు సీజ్, వ్యక్తిపై పీడీ యాక్ట్ కేసులు పెడతాం



**జన్నారం, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** అటవీ శాఖ ఆంక్షలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జన్నారం మండలం ఇంధనపెల్లి అటవీశాఖ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇంతకు ముందు అక్రమ రవాణా చేసిన ట్రాక్టర్లను పట్టుకున్నామని, అయినా కొంతమంది రాత్రి వేళలో ఇసుక తలిస్తున్నారననే సమాచారం మేరకు కేవలం ఇంటి నిర్మాణాలు, ప్రభుత్వ అవసరాల మేరకు మాత్రమే ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక రవాణాకు అనుమతి ఉందని, వాటికి కాకుండా మిగిలిన వాటికి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే ట్రాక్టర్లను జప్తు చేస్తామని, అలాగే అక్రమ కలప రవాణా, స్మగ్లింగ్, కలపను ఇంటి వద్ద నిల్వ చేయడం వంటివి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. 1967 అటవీ సంరక్షణ చట్టం అలాగే 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం ఇంధన పెల్లి రేంజ్ పరిధిలో ఆంక్షలు అతిక్రమించిన వారికి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించి అటవీశాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## దివంగత మాజీ వీఆర్వో భీమిరెడ్డికి నివాళులు

- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి దంపతులను పరామర్శించిన ఎమ్మెల్యే శంకర్

- పలువురు కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**కొందుర్గు, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ):** షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి దంపతుల ఇంట విషాదం నెలకొనడంతో శుక్రవారం కొందుర్గు మండలం ఆగిరాల గ్రామంలో కృష్ణారెడ్డి తండ్రి భీమ్ రెడ్డి పార్థివ దేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. వీఆర్వోగా ఎన్నో సేవలు అందించి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న భీమ్ రెడ్డి ఆత్మ శాంతించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ భగవంతుని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చావు పుట్టుకలు సహజమని, ఒక మంచి కీర్తి ప్రతిష్టలు సంపాదించి మనకు దూరంగా వెళ్లిన వారికి స్వర్గ ప్రాప్తి లభించే విధంగా భగవంతుని వేడుకోవాలని ధైర్యం చెప్పారు. కృష్ణారెడ్డి కుటుంబానికి ఇది తీరనిలోటని ఎమ్మెల్యే శంకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, రఘునాయక్, పురుషోత్తం రెడ్డి కర్ణాకర్, జితేందర్ రెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, కుమార్ గౌడ్, రామ్ రెడ్డి, కేషంపేట మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, మహబూబ్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే వెంట హాజరయ్యారు.

### అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన చేయనున్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ):** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా ఈ నెల 1 వ తేదీన శనివారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, జగదీశ్వర్ గౌడ్, గంగాధర్ రెడ్డిలతో కలిసి రూ.2.56 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టబోయే అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ డివిజన్ల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు తప్పకుండా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

## విద్యార్థి దశ నుంచే చట్టాలపై కనీస అవగాహన ఉండాలి

-నాగోల్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు




**ఎల్బీనగర్, ఫిబ్రవరి 28 (జర్నలిస్టు డైరీ) :** బాల్య దశలో కేవలం చదువు, ఆటపాటలకే చిన్నారులను పరిమితం చేయాలని నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎన్..లక్ష్మీదేవి, రాచకొండ ఏహెచ్‌టియూ ఎస్సై కే.రాములు నాయక్, ఎస్సై జీ.వెంకట శ్రీను, ఏఎస్సై పి.శ్రీనివాస్‌రావు, మహిళా ఏఎస్సై అనురాధలు తెలిపారు. శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రాచకొండ ఎస్‌ఓటి ఎల్బీనగర్ ఇంచార్జ్ అడిషనల్ డిసిపి ఎండి షాకీర్ హుస్సేన్ సూచన మేరకు రాచకొండ ఏ హెచ్ టి యు ఆధ్వర్యంలో నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ. బాల బాలికలకు విద్యను అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. బాల కార్మికులు, నిర్బంధ కార్మికులు, బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లలపై లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, బలవంతపు వ్యభిచారం, ఇతర దేశాలకు విక్రయించడం, యాచన, యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్ ప్రయాణంలో టి సేఫ్ అప్లికేషన్, రోడ్డు భద్రత, డ్రగ్స్, ఇవిటీజింగ్, నూతన చట్టాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ విషయాలను గుర్తుంచుకొని ఏవైనా సమస్యలు ఎదురైతే డయల్ 100 లో సంప్రదించాలన్నారు. మహిళలు జాగ్రత్తలు పాటిస్తూ ధైర్యంగా ముందుకు సాగుతూ ధైర్యంగా ఉండాలన్నారు. ఒకవేళ సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ డయల్ 1930, ఉమెన్ హెల్ప్ లైన్ 1091/181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098/112 డయల్ హండ్రెడ్ రోడ్ సేఫ్టీ గురించి పలు సూచనలు చేశారు.

## గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం






-విజ్ఞాన్ వైభవ్ -2025 ప్రదర్శన

-పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం (సైన్స్ డే) సందర్భంగా నిర్వహించిన విజ్ఞాన్ వైభవ్ -2025 ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివ సేనరెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. సభా ప్రాంగణంలో శాస్త్ర రంగంలో దిగ్గజులైన దివంగత భారతరత్నాలు సీవీ రామన్, అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టడంలో తెలంగాణ ప్రభుత్వం తన వంతు ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఆ మేరకు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలన్నారు. దేశ రక్షణ రంగానికి ముఖ్య కేంద్రాలుగా ఉన్న హైదరాబాద్- బెంగళూరు నగరాల మధ్య డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ను కోరారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన విజ్ఞాన్ వైభవ్- 2025 ప్రదర్శనను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. సభా ప్రాంగణంలో శాస్త్ర రంగంలో దిగ్గజులైన దివంగత భారతరత్నాలు సీవీ రామన్, అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్రం.. ప్రత్యేకించి హైదరాబాద్ నగరం కొన్ని దశాబ్దాలుగా దేశ రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న బీడీఎల్, డీఆర్‌డీఓ, మిథాని, హెచ్‌ఏఎల్ వంటి సంస్థలు దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తదితర ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి అని, దేశ రక్షణ రంగానికి హైదరాబాద్‌తో పాటు బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయి. ఈ రెండు నగరాల మధ్య "హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్"ను ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గతంలోనూ కోరాం అన్నారు. "హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్" ఏర్పాటు ద్వారా రక్షణ రంగంలో భారీగా పెట్టుబడులు వస్తాయి. స్కైరూట్ లాంటి స్టార్టప్, ప్రైవేటు సంస్థలు ఇప్పటికే రాకెట్లను తయారు చేస్తున్నాయి. కారిడార్ ప్రకటన రక్షణ రంగానికి మరింత ఊతం ఇచ్చినట్టు అవుతుంది అని. హైదరాబాద్- బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు రక్షణ మంత్రిగా రాజ్‌నాథ్ సింగ్ సహకారం, మద్దతు ఎంతో అవసరం. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వంగా మేము ప్రయత్నిస్తాం అని తెలిపారు. దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపైనే ఉంది. ఐటీ నిపుణులతో పాటు సంప్రదాయ కోర్సులు చదివే ఇంజనీర్ల అవసరం కూడా మన దేశానికి చాలా ఉంది. యువతను ఆ దిశగా ప్రోత్సహించేందుకు సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాం అన్నారు. లక్షలాది మంది విద్యార్థిని విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి, దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తి నింపడంలో ఇలాంటి ఎగ్జిబిషన్స్ ఉపయోగపడతాయి" అని ముఖ్యమంత్రి తెలిపారు.

## ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ)** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇంటర్మీడియట్ పరీక్షలపై, జిల్లా కలెక్టర్లతో, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నుండి డిఆర్ఓ సంగీత మాట్లాడుతూ.. మార్చి 5 వ తేదీ నుండి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 185 పరీక్షా కేంద్రాల ద్వారా 77,863 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 69,348 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసి వేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపేలా, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, చేవెళ్ళ ఆర్డీఓ చంద్రకళ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ అధికారులు, పోస్టల్ శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, మెడికల్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ విద్యార్థుల రోడ్డు ప్రమాద ఘటనపై విచారం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

-బాధిత విద్యార్థిని, విద్యార్థులు ధైర్యం కోల్పోవద్దు
-బాధిత విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు అండగా ఉంటాం
-ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో వీర్లపల్లి, అంతిరెడ్డి గూడ అప్పరెడ్డిగూడ గ్రామాల నుండి విద్యార్థులు ఆటో ప్రయాణం ద్వారా ప్రతి పట్టణంలోని సత్యసాయి పాఠశాలకు చదువుల నిమిత్తమై వస్తూ పోతుంటారు. కానీ శుక్రవారం రెడ్ రోజ్ ప్యాలెస్ దగ్గర స్కూటీ ఎదురు రావడం వల్ల అదుపుతప్పి ఆటో బోల్తా పడి పదిమంది విద్యార్థులు తీవ్ర గాయాల పాలవ్వడంతో స్థానికులు తక్షణమే స్పందించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన విషయం అందరికీ తెలిసిందే. విద్యార్థిని, విద్యార్థులు గాయలపాలవడంతో ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు గాయపడిన విషయం తనను బాగా కలిచి వేసిందని, కొన్ని అనివార్య కారణాలవల్ల విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పరామర్శించడానికి రాలేకపోవడంతో తను ఎంతో బాధపడుతున్నానని తెలియజేశారు. విద్యార్థులు కానీ, తల్లిదండ్రులు కానీ అధైర్యపడవద్దని, తాము అండగా ఉంటామని తెలిపారు. విద్యార్థులు త్వరగా కోలుకునేందుకు వైద్యులు సహకరిస్తున్నారని తెలుసుకున్నానని, మరింత మంచి వైద్యం కొరకై వైద్యులకు సూచించినట్టు తెలిపారు. అదేవిధంగా స్కూలుకు సంబంధించిన వాహనాలు కానీ, ప్రైవేట్ వాహనాలు కానీ, ఆటోలు కానీ స్కూల్ విద్యార్థుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరం అని, ఇలాంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా వాహన యజమానులు చూసుకోవాలని, స్కూల్ యాజమాన్యాలు కూడా ఇలాంటి విషయాలపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

# ఒక్క ఆటోలో 15 మంది ఎలా కూర్చుంటారు.. ?

-అసలు ఆర్టీఓ, విద్యా శాఖా అధికారులు ఏం చేస్తున్నట్టు ?
-బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ పట్టణంలోని శ్రీ సత్య సాయి ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఆటో ప్రమాదానికి గురై గాయపడ్డారు. నందిగామ మండలంలోని వీర్లపల్లి, చర్ల అంతిరెడ్డిగూడ, అప్పారెడ్డి గూడ గ్రామాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఉదయం పాఠశాలకు వెళ్లేందుకు ఆటోలో ప్రయాణిస్తుండగా, రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ కారణంగా ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ పిచ్చకుంట్ల పాండు తీవ్రంగా గాయపడగా, కొంతమంది విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన విద్యార్థులను తక్షణమే ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే బీసీ సేన నాయకులు ఆసుపత్రికి చేరుకుని గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి, వారికి మెరుగైన చికిత్స అందించాల్సిందిగా సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ఘటనపై బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఒకే ఆటోలో 15 మంది ఎట్లా కూర్చున్నారని వారు అన్నారు. అసలు ఆర్టీఓ విద్యా అధికారులు ఏం చేస్తున్నారు అని వారు ప్రశ్నించారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో చర్చించనున్నామన్నారు. విద్యార్థుల భద్రత మా ప్రాధాన్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసేన అసెంబ్లీ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప, అసెంబ్లీ బీసీ సేన ప్రధాన కార్యదర్శి భూషం నరేష్, అసెంబ్లీ బీసీసేన ట్రెజరర్ చందులాల్, షాద్నగర్ టౌన్ అధ్యక్షులు తంగిడిపల్లి శంకర్, టౌన్ బీసీ సేన ప్రధాన కార్యదర్శి రవి, మల్కాపూర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వెనకాల నిలబడే వ్యవస్థ బంద్ కావాలి

-స్థానిక ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీల సత్తా చాటాలి



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ నియోజకవర్గంలో బీసీ సేన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో జనరల్ కోటాలో బీసీల సత్తా చాటాలని, వెనకాల నిలబడే వ్యవస్థ మారాలని వారు అన్నారు. అదే విధంగా బీసీ వర్గాలు భారతదేశ అభివృద్ధికి కీలక భూమిక పోషిస్తున్నాయని, వ్యవసాయం, వాణిజ్యం, సేవ రంగం, వ్యాపారం, ఉద్యోగాలు ఇలా అన్ని రంగాల్లో తమ అంకితభావంతో ఎదుగుతూ దేశానికి సహకారం అందిస్తున్నాయన్నారు. కానీ, రాజకీయంగా బీసీల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం తీవ్రమైన అసమతుల్యత, ఈ అసమతుల్యతను తొలగించేందుకు ఈ స్థానిక ఎన్నికలు మనకు గొప్ప అవకాశం అని అన్నారు. ఎందుకు బీసీల పాలన అవసరం సమాజానికి న్యాయం చేయగల నాయకత్వం రావాలని, ప్రజా సమస్యలపై పని చేసే నాయకులు అధికారం పొందాలని, బీసీల సంక్షేమం కోసం పోరాడే హక్కుగా మారాలని, రాజకీయంగా బలమైన స్థానాన్ని నిర్మించుకోవాలని వారు అన్నారు. ఈ ఎన్నికల్లో బీసీల భాగస్వామ్యం పెరగాలని, మన బలాన్ని గుర్తించి, బీసీ వర్గాల అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఒకరి ఓటు మరొకరి భవిష్యత్తును నిర్ణయిస్తుంది! కాబట్టి, మన సామూహిక శక్తిని అర్థం చేసుకుని, ఈ ఎన్నికల్లో బీసీల విజయాన్ని ఖాయం చేయాలన్నారు. బీసీలు ఎవరికి ఓటు వేయాలి? బీసీల అభివృద్ధిని ప్రోత్సహించే వారికి, బీసీ వర్గాలకు అన్యాయం చేయని వారికి, బీసీల హక్కులను కాపాడే వారికి మాత్రమే ఓటు వేసే సమయం ఇది. రాజకీయ పార్టీల వాగ్దానాలకు మోసపోకుండా, వాస్తవానికి దగ్గరగా ఉండే నాయకులను ఎంచుకోవాలన్నారు. ఈసారి మనం వెనుకబడి ఉండకూడదు! పార్టీలు మనల్ని ఓటు బ్యాంక్‌గా చూసే రోజులు పోయాయన్నారు. పాలనలో మనకు రావాల్సిన స్థానం, హక్కు, గౌరవం సాధించుకోవాలన్నారు. బీసీల నాయకత్వాన్ని బలంగా నిలబెట్టి, అధికారం మన చేతుల్లోకి తీసుకురావడమే ఈ ఎన్నికల అసలు లక్ష్యమన్నారు. "బీసీల పరిపాలన %-% సమాజ అభివృద్ధి" అనే నినాదంతో ముందుకు సాగుదామని, మనం ఒక్కటిగా ఉన్నప్పుడే బలమైన శక్తిగా మారగలమన్నారు. స్థానిక స్థాయిలో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించి, గెలిపించి, అధికారంలోకి తెచ్చే బాధ్యత మనదే! మన హక్కుల కోసం మనమే పోరాడాలి – మన భవిష్యత్తును మనమే నిర్మించాలి! ఈ ఎన్నికలు బీసీ వర్గాల భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయన్నారు. కాబట్టి, ప్రతి ఓటు బీసీ అభివృద్ధికి దోహదపడేలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సేన అసెంబ్లీ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి భూషం నరేష్, అసెంబ్లీ కోశాధికారి చందూలాల్ జమాల్పూర్, అసెంబ్లీ యువజన ఉపాధ్యక్షులు శివ ముదిరాజ్, షాద్నగర్ టౌన్ అధ్యక్షులు బీసీ సేన తంగేడుపల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి షాద్నగర్ బిసి సేన ప్రధాన కార్యదర్శి మల్కాపురం రవి, ఉపాధ్యక్షులు వరప్రసాద్, భాగ్యనగర్ కాలనీ అధ్యక్షులు సురేందర్ గౌడ్, ఉపాధ్యక్షులు సాయిలు, ఫరూక్నగర్ మండల్ అధ్యక్షుడు మేకల వెంకటేష్, ఉపాధ్యక్షులు మార్గం భద్రప్ప, 11వ వార్డు అధ్యక్షులు మడంపల్లి శివకుమార్, అధ్యక్షులు ఇష్కం గారి హరికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులను పరామర్శించిన బీఆర్ఎస్ యువ నాయకులు వై.మురళీకృష్ణ యాదవ్



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ):** రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులను షాద్ నగర్ బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తనయుడు, పార్టీ యువ నాయకుడు వై మురళి కృష్ణ యాదవ్ పరామర్శించారు. వీర్లపల్లి, చర్ల అంతిరెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ గ్రామాలకు చెందిన చిన్నారులు ఆటోలో పాఠశాలకు బయలుదేరి వెళుతుండగా ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడ్డ పలువురు విద్యార్థులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా వారిని మురళి కృష్ణ యాదవ్ పరామర్శించారు. వైద్య సిబ్బందితో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మురళి కృష్ణ యాదవ్ వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్, వీర్లపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, పాండు, నాయకులు శ్రీధర్ రెడ్డి, వీరేశం గుప్తా, చీపిరి రవి యాదవ్, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, రాజరమేశ్వర్ రెడ్డి, చందు నాయక్, నందిగామ శ్రీనివాస్, గుండు అశోక్ తదితరులు ఉన్నారు

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

-మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ రెడ్డి స్వప్న



**నర్సంపేట ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక పరిపుష్టిని సాధించాలని మాజీ జడ్పి ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సూచించారు. నర్సంపేట మండలంలోని రాజ పల్లె గ్రామంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అధ్యక్షతన మైత్రి మహిళా పొదుపు సంఘం 17వ వార్షికోత్సవ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతి థిగా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న పాల్గొని మాట్లాడారు. ఆర్థిక క్రమశిక్షణ పొదుపు ద్వారానే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు కుటుంబ బాధ్యతలు నిర్వహించే మహిళలు ఐక్యమత్యంతో పొదుపును పాటించడం వలన కుటుంబం తద్వారా సంఘం మరియు గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. గత 17 సంవత్సరాలుగా గ్రామ మహిళలంతా కలిసి ఒకే కుటుంబ సభ్యులుగా క్రమశిక్షణతో సంఘాన్ని నడపడం నాకు వ్యక్తిగతంగా ఎంతో స్ఫూర్తినిచ్చిందని అన్నారు. భవిష్యత్తులో సంఘం మరింత ఆర్థిక అభివృద్ధి చెందాలని కోరుతూ సంఘ బాధ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మైత్రి పొదుపు సంఘం బాధ్యులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న మహబూబాబాద్ ఎమ్మెల్యే



**మహబూబాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ)** హైదరాబాద్ గాంధీ భవన్ లో టీ పీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్,సిఎం రేవంత్ రెడ్డి ,టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులతో పాటు మహబూబాబాద్ ఎమ్మెల్యే డా" భూక్యా మురళి నాయక్ , కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, డిసిసి అధ్యక్షులు పాల్గొన్నారు.

# విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్



**ఆలేరు ఆర్సీ, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శు క్రవారం రోజున సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు. ఈ సందర్శనలో భాగంగా పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టరు ఎం.హనుమంతరావు.

# శనిగరం మాజీ ఉప సర్పంచ్ బిజెపిలో చేరిక



**నర్సంపేట ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** నల్లబెల్లి మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు బూర కృష్ణ గౌడ్ శుక్రవారం బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా కృష్ణ గౌడ్ కు కాషాయ కండువా కప్పి బిజెపిలోకి రాణా ప్రతాప్ రెడ్డి ఆహ్వానించారు అనంతరం రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారని బిజెపి పార్టీ పట్ల విశ్వాసం పెరిగి పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో బిజెపి యువతకు పెద్దపీట వేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పిస్తుందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు పెరుమాండ్ల కోటి, వల్లే పర్వతాలు, యువమోర్చా నాయకులు విగ్నేష్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు మీ భాద్యతగా ఒక మొక్క నాటండి

**-పర్యావరణ జాతీయ అవార్డు గ్రహీత...దైద హర్షిత్.**



**మహబూబాబాద్ ఫిబ్రవరి 28(జర్నలిస్ట్ డైరీ) :** మహబూబాబాద్ జిల్లా కేంద్రం లో ఇందిరా నగర్ కు చెందిన దైద హార్షిత్ పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా మొక్కలు నాటుతున్నాడు. ఈ రోజు సైన్స్ డే సందర్భంగా హోలి వాడ్స్ స్కూల్ డైరెక్టర్ అనుదీప్ కు.మొక్కలు బహూకరించి శుభాకాంక్షలు తెలిపిన దైద హర్షిత్. ఈ సందర్భంగా హర్షిత్ మాట్లాడుతూ..... నేను నా చిన్న తనం నుంచే మా నాన్న న్ని ఆదర్శంగా తీసుకొని పర్యావరణ పరిరక్షణ. కోసం కృషి చేస్తున్నానని అన్నారు.మీరు కూడా మీ వంతుగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతిరాలు నార్కట్పల్లి మల్లమ్మ కుటుంబానికి 5000/-ఆర్థిక సహాయం

**- అందించిన కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీఫ్ రెడ్డి**



**ఆలేరు ఆర్సీ, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కూరెళ్ళ గ్రామంలో శుక్రవారం రోజు నిరుపేద కుటుంబానికి చెందిన నార్కట్పల్లి మల్లమ్మ మృతిచెందారు. వారి కుటుంబానికి కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప రెడ్డి సహకారంతో తాజా మాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పల యాదవ్ ఆధ్వర్యంలో వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎరుకల స్వామి గౌడ్ ,జనరల్ సెక్రటరీ గడ్డం అశోక్, జిల్లా నాయకులు ఉప్పల నర్సింహా, కూరెళ్ల రమేష్, యువజన విభాగం మండలం కార్యదర్శి నిమ్మనగోటి గణేష్, విద్యార్థి విభాగం మండలం కార్యదర్శి కూరెళ్ళ మణి కుమార్, గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి గడ్డం సురేష్, నాయకులు మరుపాక పరుశురాం, మోతే నందరెడ్డి, దొంతరబోయిన వెంకటయ్య, నార్కటపల్లి రవి, భాషబోయిన శంకరయ్య ,ఐలయ్య ,నిమ్మల రవి, ఉప్పల మహేష్, యాదయ్య, కొమ్ము యాదయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

**-రైతు కాలనీ కోట మైసమ్మ దేవాలయంలో చండీ హెూమం**

**-అన్నప్రసాద వితరణ చేసిన శుక్రవర్ధన్ రెడ్డి సుమతి దంపతులు**

**-చండీహెూమం నిర్వహించిన ఉపాధ్యాయులు ప్రదీప్ లావణ్య దంపతులు**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** అమావాస్యను పురస్కరించుకొని షాద్ నగర్ పట్టణంలోని రైతు కాలనీలో వెలసిన కోట మైసమ్మ దేవాలయంలో చండీ హెూమం నిర్వహించారు. అదేవిధంగా రైతు కాలనీ సంక్షేమ సంఘం నేత శుక్రవర్ధన్ రెడ్డి, సుమతి దంపతుల 36వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు రైతు కాలనీకి చెందిన ప్రదీప్, లావణ్య దంపతులు చండీ హెూమ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి అమావాస్యకు కోట మైసమ్మ దేవాలయంలో పూజారి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టులు కేపీ, రాఘవేందర్ గౌడ్, శ్రీశైలం తదితరులు హాజరయ్యారు. అదేవిధంగా రైతు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పటోళ్ల వెంకటేశ్వర రెడ్డి, నారాయణరెడ్డి, గోపాల్ రెడ్డి, మల్లేష్ గౌడ్, విజయ రాములు గౌడ్, రామచంద్రయ్య, పెంటయ్య, రాకేష్, మారుతి, అడ్వకేట్ గంధం సురేందర్, గంధం శ్రీనివాస్, గంధం ఆనంద్, మాజీ ఎంపిటిసి రవీందర్, స్వాతి శివ తదితరులు పాల్గొన్నారు. ఆయా కాలనీల నుండి ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా శుక్రవర్ధన్ రెడ్డి సుమతీ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు పలువురు తెలియజేశారు.

# వెనకబడిన నేతకాని మహార్ కులానికి అన్ని రంగాలలో న్యాయం చేయండి

**-నేతకానీ జిల్లా అధ్యక్షుడు సునర్కర్ రాంబాబు**

**-మూడవ స్థానంలో ఉన్న నేతకాని లకు అన్యాయం జరుగుతుంది**

**-ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ ను కలిసి వినతి...**

**-గ్రూప్ "డి" చేర్చడం ద్వారా హక్కుల్లో నేతకానీ కులాలకు అన్యాయం...**



**మందమర్రి, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** నేతకాని మహార్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ ఆదేశాల మేరకు హైదరాబాద్ బూర్గుల రామకృష్ణ రావు భవన్ లో డా.షమీమ్ అక్తర్ ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమీషన్ చైర్మన్ కు నేతకాని మహార్ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు సునార్కర్, రాంబాబు నేతకాని ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునార్కర్ రాంబాబు నేతకాని మాట్లాడుతూ.. వర్గీకరణలో గ్రూప్ 1, 2, 3 కి బదులుగా ఎ, బి, సి, డి లను ఏర్పాటు చేసి నేతకాని, మహార్ ను గ్రూప్ సి లో ఉంచి, మాలతో పాటు మరికొన్ని అభివృద్ధి చెందిన కులాలను గ్రూపు డి లో చేర్చాలని వినతిపత్రం అందజేయడం జరిగిందని తెలిపారు. డా.షమీమ్ అక్తర్ ప్రభుత్వానికి ఇచ్చిన వర్గీకరణ నివేదికలో మాలసాలె, నేతకానీలను గ్రూపు 3 లో చేర్చడమే కాకుండా, తెలంగాణ రాష్ట్రంలో లేనీ మాలసాలె కులం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో ఉంటుంది కాని నేతకాని కులం లక్ష ముప్పై వేల జనాభా కలిగి మాల, మాదిగల తరువాత మూడవ స్థానంలో ఉన్న అతిపెద్ద దళిత కులం నేతకాని కులమని, దీనికి తోడు నేతకానీలు ఆసిఫాబాద్, కాగజ్ నగర్, ఆదిలాబాద్ ప్రాంతాలలో మహర్ లుగా సర్టిఫికెట్స్ కలిగి ముప్పై వేలపై చిలుకు జన సంఖ్యతో ఉన్నారని తెలియజేసారు. అంతే కాకుండా నేతకాని కులానికి ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలనీ, అంతేకాక గ్రూపు బి లో ఉండి నాల్గవ స్థానంలో ఉన్న బేడ, బుడగ జంగాలకు, మరికొన్ని కులాలు కలిపి గ్రూపు-1 గా ఏర్పాటు చేసారు కాబట్టి సామాజికంగా, విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో వెనకబడి ఏజెన్సీ ప్రాంతాలలో ఏలాంటి హక్కులు లేకుండా పేదరికంలో మగ్గుతున్న మూడవ అతిపెద్ద "నేతకాని కులానికి, "మహర్ " మరికొన్ని కులాలను కలిపి గ్రూపు సి లో ఉంచి మెరుగైన ప్రయోజనాలను పొంది, అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన మాలతో పాటు ఇతర కులాలను గ్రూపు డిలో చేర్చి అన్ని రంగాలలో వెనుకబడ్డ నేతకాని కులానికి న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాడి గంగాధర్, మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మహిళ జిల్లా అధ్యక్షురాలు కామెర అనూష, రాష్ట్ర యువజన అధ్యక్షులు అనపర్తి యువరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సంతోష్, నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుమ్మిడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ నారాయణ పాఠశాలలో సైన్స్ ఫెయిర్







**ఎల్బీనగర్, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** విద్యార్థులలో వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు చొరవతో పని చేస్తున్నట్లు నారాయణ పాఠశాలల జీఎం గోపాల్ తెలిపారు. బుధవారం ఎల్బీ నగర్ శివగంగ కాలనీలోని నారాయణ పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రీ-ప్రైమరీ నుండి హైస్కూల్ వరకు విద్యార్థులు సరదాగా ప్రయోగాలు, సృజనాత్మక ప్రాజెక్టులు, ఉత్తేజకరమైన ఆవిష్కరణల ద్వారా సైన్స్ను చురుకుగా అన్వేషిస్తున్నారన్నారు. ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు, విజ్ఞాన శాస్త్రాన్ని ఆటల కార్యకలాపాల ద్వారా పరిచయం చేస్తారన్నారు. మొక్కలు పెరగడం, అయస్కాంతాలతో ఆడుకోవడం, రంగులు కలపడం వంటివి పిల్లలు, ప్రకృతి, రోజువారీ దృగ్విషయాల పట్ల ఉత్సుకతను పెంపొందించడానికి సహాయపడతాయన్నారు. కథలు, ప్రయోగాల ద్వారా నేర్చుకోవడం విజ్ఞాన శాస్త్రాన్ని సరదాగా, ఉత్తేజపరుస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బేకింగ్ సోడాతో అగ్నిపర్వతాలను తయారు చేయడం, తేలియాడే, మునిగిపోయే వస్తువులతో తేలికను అర్థం చేసుకోవడం, సృజనాత్మక నమూనాలతో సౌర వ్యవస్థను అన్వేషించడం వంటి ప్రయోగాలలో పాల్గొంటారు. ఈ కార్యకలాపాలు వారికి ప్రశ్నలు అడగడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయన్నారు. విద్యార్థులు పెరుగుతున్న కొద్దీ, వారు సైన్స్ ఫెయిర్లు, రోబోటిక్స్ క్లబ్ లు, కోడింగ్ వర్క్ షాపులలో పాల్గొంటారన్నారు. వారు ఆకర్షణీయమైన ప్రాజెక్ట్ల ద్వారా విద్యుత్, సాధారణ యంత్రాలు, మానవ శరీర నిర్మాణ శాస్త్రాన్ని అన్వేషిస్తారన్నారు. హ్యాండ్-ఆన్ లెర్నింగ్ వారికి సైద్ధాంతిక భావనలను నిజ జీవిత అనువర్తనాలతో అనుసంధానించడంలో సహాయపడుతుందన్నారు. ఇది ఆవిష్కరణపై ఆసక్తిని రేకెత్తిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డీ హెడ్లు శివరంజిని, మహేశ్వరి, మీనా, కోఆర్డినేటర్లు శరత్ బాబు, గాయత్రి, శిరీష, ఏజీఎం హేమాంబర్, ఆర్ ఐ రవి ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ హరి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ సంధ్య, ఈఐడీజడ్ వైస్ ప్రిన్సిపాల్ తారా, ఏఓ కరుణాకర్, రాధ తదితర బృందం పాల్గొన్నారు.

# అక్రమ వేయించర్లకు అధికారుల అండా..?

**-ఎవరి బలంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలు అంతులేదు**
**-ఇది అధికారులకు తెలియదా ?**
**-తెలిసినా అంతా మామూలేనా..**

**మంచిర్యాల జిల్లా, ఫిబ్రవరి 28 (జర్నలిస్ట్ డైరీ) :** మంచిర్యాల జిల్లా కేంద్రంగా మారడం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయనడంలో సందేహం లేదు. ఓ వైపు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే మరోవైపు చెరువులను, శిఖం భూములను కబ్జా చేసి అక్రమంగా ప్లాట్లు ఏర్పాటు చేసి మరి కొంతమంది రెడీమేడ్ గా ఇండ్లను నిర్మించి అమాయకులకు అంటగడుతుండటంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలియదా.. తెలిసినా అంతా మామూలేనా ..అనే ఆరోపణాలు వినిపిస్తున్నాయి. నిరంతరం పర్యవేక్షించవలసిన అధికారులు పత్రికల్లో, టీవీ ఛానల్ లో న్యూస్ వెలువడే వరకు గాని స్పందించకపోవడంలో సంబంధిత అధికారుల కర్తవ్యంలో పర్యవేక్షణలోపమా..లేక తెలిసినా ప్రలోభాలకు లోబడి పట్టిపట్టనట్లు వ్యవహరించడమా.. అనే అనుమానాలు పలువురిలో రేకెత్తిస్తున్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంగా మారినప్పటి నుండి రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అంతులేకుండా పోతుంది, ఏ మూలాన ప్రభుత్వ భూమి, శిఖం, చెరువు భూములు కూడా వదలడం లేదంటే వారి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అవినీతి ఎంతవరకు కొనసాగుతుందో ప్రజలు అర్థం చేసుకోవాలి.

ఓవైపు ఇల్లు లేని పేదవారికి డబుల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇల్లు కట్టించడానికి ప్రభుత్వ భూమి ఉంటే దాని వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినప్పుడు అధికారులు మాత్రం ఎక్కడ ప్రభుత్వ భూమి లేదని చెబుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల్లోకి చెరువు, శిఖం భూమి ప్రభుత్వ భూములు దరిచేరుతుంటే వీరు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా సమాచారం ఇస్తే మీరు రాతపూర్వకంగా రాసిఇవ్వండి అని మాయ మాటలు చెబుతూ సమాచారంలో ఒకరి పైన ఒకరు నిందలు వేస్తూ అధికారులు కాలాన్ని వెల్లదీస్తున్నారని ఆరోపణలు తీవ్రమయ్యాయి.

**ధనార్జనే ధ్యేయంగా అక్రమ వెంచర్లు...**

వేంపల్లి సమీపంలో ప్రతిరోజు వందలాదిమంది వీఐపీలు రాకపోకలు నిర్వహిస్తున్న









ఆర్టీవో కార్యాలయానికి వెనకాల కూతవేటు దూరంలో కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధనార్జన నిమిత్తం ఎలాంటి డిటిపిసి లేఅవుట్ పర్మిషన్లు లేకపోయినా అక్రమ వెంచర్ లను ఏర్పాటు చేసి అమాయకులను అంటగట్టడానికి ప్రయత్నిస్తుంటే ఓ పత్రికలో వార్త వచ్చి నాలుగు, ఐదు రోజులు గడుస్తున్న అధికారుల స్పందన లేకపోవడంతో అధికారులపై పలు అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రభుత్వ భూమిలో వెంచర్ రోడ్డు...**

అలాగే జైపూర్ మండలం రసూల్ పల్లి వద్ద ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏర్పాటు చేసిన వెంచర్ %శ్రీ% లో కొంత భూమిని కొనుగోలు చేసి పక్కకు ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కబ్జా చేసి సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి పేరిట వెంచర్ ఏర్పాటు చేసి కబ్జా చేసిన ప్రభుత్వ భూమిలో నుండి వేంచర్లలో వెళ్లడానికి తారు రోడ్డు వేసి ప్లాట్లు, విల్లాలు చేసిఅమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు తెలుస్తుంది. రసూల్ పల్లి నుండి 100 మీటర్ల దూరంలో ఇంత జరుగుతున్నా అధికారులకు తెలియదా, తెలిసిన పట్టించుకోకపోవడం వెనుక మర్మం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ వెంచర్లు ఏర్పాటు చేసే కొన్ని ప్రాంతాలలో కొంతమంది సంబంధిత పంచాయతీ సెక్రెటరీ, రెవెన్యూ అధికారుల అండదండలతోనే రియల్ స్టేట్ వ్యాపారులు రెచ్చిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సైతం మంచిర్యాల జిల్లా నుండి రంగంపల్లికి వెళ్లే మార్గంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరువు కట్టపై తూములను మూసివేసి కట్టను వెడల్పు చేసి తమ వెంచర్కు భారీ వాహనాలు వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడుతుంటే ఈ విషయమై ఓ పత్రికలో వార్తా ప్రచురించగా అప్పటి స్థానిక తహసిల్దార్, ఆర్డీవో స్పందించి వెంచర్ల అమ్మకాన్ని అడ్డుకట్ట వేశారు. ఇప్పటికైనా మంచిర్యాల జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమాలకు గురవుతున్న ప్రభుత్వ, శిఖం చెరువు భూములను స్వాధీనపరచుకొని అక్రమంగా వెంచర్లను ఏర్పాటు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చట్టరీత్యచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.




Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s. SRI DIVYA PRINTERS, Plot No.33 & 34, 2nd Floor, Vasthu Colony, LB. Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10, Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana -500035. RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465.